క్లుప్తంగా

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి రావులపాలెంకు చెందిన మల్లిడి వెంకటరెడ్డి, మంగాయమ్మ దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆలయ అర్చకులు స్వామి చిత్రపటం అందజేశారు.

అందరికీ రేషన్ ఇవ్వాలి

అంబాజీపేట: ప్రతి కార్డుదారుడికి రేషన్ సరకులు అందివ్వాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట హడ్కో కాలనీలో ఎండీయూ వాహనం ద్వారా జరుగుతున్న రేషన్ సరకుల పంపిణీని గురువారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ తూనికల్లో తేడాలు లేకుండా సరకులు సక్రమంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేయాలి

అంబాజీపేట: బౌద్ధధర్మం విశిష్టతను ప్రజలందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా (బీఎస్ఐ) జిల్లా ఉపాధ్యక్షుడు పెట్టా వెంకటరావు అన్నారు. మొసలపల్లిలో ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా మండల శాఖ అధ్వర్యంలో బీఎస్ఐ 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మండల శాఖ అధ్యక్షుడు కోట హనుమంతరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. అంతకుముందు బీఎస్ఐ జెండాను ఎగరవేసి బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాగాబత్తుల సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

మామిడికుదురు: పెదపట్నం వైఎస్సార్ సీపీ గృహ సారథి కాజులూరి సుజాత భర్త కాజులూరి దుర్గాప్రసాద్ నగరం గ్రామంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆమె కుటుంబ సభ్యులను గురువారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరామర్శించారు. దుర్గాప్రసాద్ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ పంపిణీ



అనంతలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రామకృష్ణ

అంబాజీపేట: అనారోగ్య కారణంగా గత కొద్ది రోజులుగా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసుపల్లి శివారు బొక్కేవారిపేటకు చెందిన బొక్కే అనంతలక్ష్మి వద్దకు వలంటీర్ గంటి రామకృష్ణ వెళ్లి వృద్ధాప్య పింఛన్ గురువారం పంపిణీ చేశారు. ప్రతి నెలా లబ్ధిదారులకు పింఛన్ అందించాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అనంతలక్ష్మి చికిత్స పొందుతున్నారని తెలుసుకుని రామకృష్ణ ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ అందజేశారు. సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: మండలంలోని ఊబలంక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 33 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. ఊబలంక, రావులపాలెంలోని అంకాలమ్మ గుడి ఏరియా, కొత్తపేట రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

లారీ ట్రాన్స్‌పోర్టు నూతన కార్యవర్గం ఎన్నిక



కానూరి పోసిబాబు (ఫైల్)

రావులపాలెం: స్థానిక కనకదుర్గా లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్టు నూతన అధ్యక్షుడు కానూరి పోసిబాబు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా నందం సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా చేకూరి వెంకటరామరాజు, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సెక్రటరీగా కాకుమళ్ళ సత్తిబాబు, జాయింట్ సెక్రటరీగా చప్పిడి ప్రసాద్, ట్రెజరర్‌గా పెద్దమళ్ల కృష్ణ, కార్యవర్గం సభ్యులుగా చాలాకా వెంకన్న, కొట్టు రవిబాబు, జంపన వెంకన్నబాబు, నిమ్మకాయల రామకృష్ణ, నాగేశ్వరరావులను ఎన్నుకున్నామన్నారు.

ఆహారం... ఆరోగ్యం

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో భరోసా
- లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ



జి.అగ్రహారంలో పోషణ్ పక్వాడా కిట్లను గర్భిణులకు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్

అంబాజీపేట: అందరికీ ఆరోగ్యం... అదే మహాభాగ్యం... తద్వారా ఇంటింటి సౌభాగ్యం.. అందుకే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. కొన్నేళ్ల క్రిందట గర్భిణులు, బాలింతలు పోషకాహారం తినకపోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేవారు. ప్రసవ సమయంలో, ప్రసవానంతరం రక్తహీనతతో మృతి చెందేవారు. పుట్టే బిడ్డకు కూడా సంపూర్ణ పోషణ అందక అనారోగ్యాలు ముసురుకునేవి. వారికి సరైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించే వారు కాదు. దీనిని దృష్టిలో పెట్టుకొని జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశంతో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, పోషణ్ పక్వాడా పథకాలు ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ప్రసవానంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కిట్లు అందిస్తున్నారు. వీటితో పాటు, పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రానివారికి రోజుకో గుడ్డు, వారానికి లీటరు పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతోందని వైద్యులు చెబుతున్నారు. పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాలకు సంబంధించి 711 అంగన్‌వాడీ కేంద్రాల్లో 9,826 మంది చిన్నారులు, 6040 మంది గర్భిణులు, 5,890 మంది బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కిట్ ఇలా...

ఈ కిట్‌లో కేజీ రాగి (చోడి) పిండి, కేజీ చిరుధాన్యాల పిండి, కేజీ అటుకులు, పావుకేజీ శనగ చిక్కి, పావుకేజీ బెల్లం, పావుకేజీ ఎండు ఖర్జూరం మొత్తంగా ఆరు రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. వీటి ఉపయోగాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు వివరిస్తున్నారు. పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు.

ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్నారు



అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహనలో భాగంగా సుమారు నెల రోజుల పాటు పోషణ్ పక్వాడా పేరుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కల్పించాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకుంటున్నారు.
– ఎం.రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంబాజీపేట

నాణ్యత బాగుంది



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా ఇస్తున్న ఆరురకాల పదార్థాలు చాలా బాగున్నాయి. సక్రమంగా వాడుతున్నాను. వీటితో పాటు గుడ్లు, పాలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తినడం వల్ల నా ఆరోగ్యం మెరుగుపడింది. పౌష్టికాహారం తీసుకువడం వల్ల కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ టీచర్ వివరిస్తున్నారు.
– సాపే తులసి, తొండవరం

జగనన్న ప్రభుత్వం దేశానికే ఆదర్శం



కొత్తపేటలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు, రమాదేవి

కొత్తపేట: ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ కనీవినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక ప్రక్క ప్రజా సంక్షేమం, మరో పక్క అభివృద్ధి కార్యక్రమాలతో దేశానికే ఆదర్శంగా నిలిచిందని అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు అన్నారు. స్థానిక కమ్మిరెడ్డిపాలెం దళితపేటలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను గురువారం సాయంత్రం అముడ చైర్మన్ డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు చేరువ చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్, పార్టీ నాయకులు బెజవాడ నారాయణరావు, వారా పండు, గ్రామ పెద్దలు వాడ సద్గుణరావు, అంబటి జీవరత్నం, వాడ సూర్యప్రకాష్, బొక్కే బాబ్జి, పాలంగి డానియేలు, ఇంజినీరింగ్ అధికారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటి చెరువుల పనులు నిలుపుదల చేయాలి



మామిడికుదురు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మగటపల్లి వాసులు

మామిడికుదురు: మగటపల్లిలో చేపట్టిన ఉప్పునీటి రొయ్యల చెరువుల పనుల్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానికులు గురువారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయం మెట్లపై నిల్చుని చెరువుల నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 28 ఎకరాల ఆయకట్టు మధ్యలో అయిదు ఎకరాల్లో రొయ్యల చెరువుల తవ్వకాలు చేపట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని వాపోయారు. ఉప్పునీటి రొయ్యల చెరువుల వల్ల కొబ్బరి తోటలు పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో పాటు తాగునీటి బావులు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అనధికారికంగా తవ్వుతున్న రొయ్యల చెరువుల ముప్పు పొంచి ఉందన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో సూరిశెట్టి మోహనరావు, భూపతి సత్యనారాయణ, బి.కరుణకుమార్, ఎస్.కిరణ్‌కుమార్, మట్టా ఏడుకొండలు, వర్ధినేని బాపిరాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'నాడు-నేడు' పనులు



నగరంలో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న డీఈఓ కమలకుమారి

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' పథకం పనుల్ని పారదర్శకంగా నిర్వహించాలని డీఈఓ ఎం.కమలకుమారి, సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం సూచించారు. వారు గురువారం నగరంలో జగనన్న విద్యా కానుక 4 స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడే జరుగుతున్న 'నాడు-నేడు' పథకం పనుల్ని కూడా పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమయ్యే నాటికి విద్యాకానుక కిట్లను విద్యార్థులకు అందించే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. విద్యాకానుక కిట్లను ముందుగా స్టాక్ పాయింట్లకు చేరవేసి, అక్కడి నుంచి విద్యార్థులకు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. దీంతో పాటు అనుకున్న గడువు నాటికి ఫేజ్-2 'నాడు-నేడు' పథకం పనుల్ని పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఎంఈఓ కోన హెలీనా, ఉపాధ్యాయులు ఉన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న జగనన్న విద్యాకానుక కిట్లను జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ బి.సుబ్రహ్మణ్యం గురువారం పరిశీలించారు. సఖినేటిపల్లి మండలంలోని స్టాక్ పాయింట్ల వద్ద విద్యార్థులకు అందించే బూట్లు, బ్యాగ్‌లను పరిశీలించారు. పాఠశాలల్లో డ్రాప్‌అవుట్స్ తగ్గించడం, ప్రతి పిల్లవాడు చదువు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారన్నారు. ఎంఈఓ నల్లి మనోహరం, మద్దాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పి.గన్నవరం/మామిడికుదురు/అంబాజీపేట: భారీ వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జి, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ జి.హరీష్‌మాధుర్ అన్నారు. పి.గన్నవరం, పోతవరం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరిచేలను గురువారం ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, పార్టీ నాయకులు నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, ఆరుమిల్లి లాల్‌బాబు, బొండాడ నాగమణి, చొల్లంగి సత్తిబాబు, నక్కా సత్యనారాయణ, శేరు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మామిడికుదురులోనూ టీడీపీ మండల అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా ఆధ్వర్యాన తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిచిపోయిన ధాన్యంను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సాయికృష్ణ ఆధ్వర్యంలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ టి.మంగతాయారుకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలబాలాజీకి పలువురి విరాళాలు



నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం అందజేస్తున్న భక్తుడు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి గురువారం పలువురు దాతలు విరాళాలు, ఆహార సామగ్రి అందించారు. ముమ్మిడివరం మండలం చినకొత్తలంకకు చెందిన కముజు సురేష్‌కుమార్, మహేశ్వరరావు, దిశ్యశ్రీజ్యోతి స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10 వేల విరాళం అందించారు. గుడివాడకు చెందిన కర్రి హేమంత్‌కుమార్, వారి కుటుంబ సభ్యులు 200 కిలోల శనగపప్పు అందించారు. యానాంకు చెందిన పినిశెట్టి సత్యనారాయణ, కుటుంబ సభ్యులు నిత్యానదానానికి రూ.286 కిలోల బియ్యం విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ ఈఓ డి.శ్రీరామవరప్రసాదరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటాలతో పాటు ప్రసాదాలను అందించారు. వారికి స్వామి వారి ఆశీస్సులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మకర్తలు కొమ్ముల సూరిబాబు, చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీను, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన 'సంపూర్ణ శ్రీమద్రామాయణం' ప్రవచనం



కొత్తపేటలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న సలాది చిన్ని దంపతులు, వేదపండితులు

కొత్తపేట: వివిధ హిందూ పురాణాలు వినడంతో కష్ట నష్టాలు తొలగి, శాంతి, జ్ఞానం, మోక్షం కలుగుతాయని ప్రముఖ ప్రవచన కర్త, వేద పండితుడు బ్రహ్మశ్రీ దెందులూరి సర్వేశ్వరసీతారామశర్మ తెలిపారు. స్థానిక హరిహర దేవాలయ ప్రాంగణంలో ఉమాకొప్పులింగేశ్వర పురాణ ప్రవచన కమిటీ ఆధ్వర్యంలో మార్చి 23 నుంచి ఈ నెల 3 వరకూ 42 రోజుల పాటు ×సంపూర్ణ శ్రీమద్రామాయణం పురాణ ప్రవచనం॰ కార్యక్రమం నిర్వహించారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ మండలంలోని పలివెలకి చెందిన ప్రవచన కర్త సీతారామశర్మ రామాయణ ప్రవచనాలు కళ్లకు కట్టినట్టు వినిపించారు. ఇలా ప్రతి రోజూ ఆయన రెండున్నర గంటల సేపు పురాణ ప్రవచనాలతో భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తారు.

వైభవంగా సీతారామ కల్యాణం

పురాణ ప్రవచనం ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక పాతరామాలయం నుంచి సీతారాముల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా హరిహరదేవాలయ ప్రాంగణానికి తీసుకువచ్చి, సీతారామశర్మ పర్యవేక్షణలో పురాణ ప్రవచన కమిటీ కన్వీనర్ సలాది రామమోహనరావు–నాగకవిత దంపతులతో రాజమహేంద్రవరానికి చెందిన వేదపండితులు సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారామశర్మ, 'శ్రీరామచంద్రమూర్తి పట్టాభిషేకం' ఘట్టాన్ని వివరించి రామాయణ పురాణం ముగించారు.

పురాణ ప్రవచనాలు ముగింపు సందర్భంగా సీతారమశర్మ దంపతులను, పండితులను ప్రవచన కమిటీ తరపున సలాది రామమోహనరావు (చిన్ని) దంపతులు పూలమాలలు, శాలువా, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అలాగే కమిటీ సభ్యులతో పాటు వివిధ సేవా సంస్థల ప్రతినిధులు ప్రవచన కర్తను ఘనంగా సత్కరించారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ ఫలాలు



పెదపట్నంలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కేశనపల్లిలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

- పెదపట్నం, కేశనపల్లిల్లో గడప గడపకూ..
- పాల్గొన్న ఎమ్మెల్యేలు చిట్టిబాబు, వరప్రసాదరావు

మామిడికుదురు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అన్ని వర్గాలకు సక్రమంగా అందుతున్నాయని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం పెదపట్నంలో జరిగింది. ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి గడపకు వెళ్లి వారికి అందుతున్న సంక్షేమ పథకాలను వివరించి బ్రోచర్లు అందజేశారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాలకు మేలు చేకూరే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఎక్కడా మాట తప్పలేదు. మడమ తిప్పలేదన్నారు. అందుకే ప్రజలకు జగన్‌పై అచంచలమైన విశ్వాసం ఉందన్నారు. జగన్ పాలనకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని చిట్టిబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, సర్పంచ్ గుబ్బల దుర్గాభవాని, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పార్టీ నేతలు కొండేటి స్టాలిన్‌బాబు, కుసుమ శ్రీధర్, జేసీఎస్ కన్వీనర్లు బొక్కా సత్యకుమారి, బళ్ల కీర్తిరైనా, కొమ్ముల గోపాలం, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల చిన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. గురువారం కేశనపల్లిలో ఎమ్మెల్యే వరప్రసాదరావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రం విపత్కర పరిస్థితుల్లో ఉండగా ప్రజలకు సీఎం జగన్ అండగా నిలిచారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను గతంలో ఎన్నడూ లేని రీతిలో అమలు చేస్తున్నారన్నారు. యెనుముల నారాయణస్వామి, కొల్లాబత్తుల అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో నియోజకవర్గ టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు, విశ్వ బ్రాహ్మణ యువత ప్రతినిధి కోడూరి చిదంబరాచారి అధ్యక్షతన విశ్వ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ సింహాద్రి కనకాచారి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల జిల్లా నేతలు తాళాబత్తుల అప్పలాచారి, చేబ్రోలు చంద్రశేఖర్, ఆవుపాటి వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని సన్నవిల్లి గ్రామంలో వేంచేసియున్న గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి, నైవేద్యాలు చెల్లించారు. అనంతరం తీర్థం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనరసింహునికి క్షీరాభిషేకం

అమలాపురం టౌన్: లక్ష్మీనరసింహస్వామి జన్మదినం సందర్భంగా గురువారం స్థానిక వాసవీ ఫంక్షన్ హాలులో వైశ్య ప్రతినిధులు స్వామి చిత్రపటానికి క్షీరాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. వైశ్య సంఘం నాయకుడు వరదా సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ వైశ్య సంఘం ముఖ్య సలహదారు వంకాయల కాశి, వాసవీ మాత ఉత్సవ కమిటీ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, వైశ్య సంఘ ప్రతినిధులు నూలు కృష్ణ, అప్పన వీరన్న, పచ్చిగోళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై వెంకన్న

అమలాపురం రూరల్: స్థానిక బండార్లంక బిళ్లవారి వీధిలో వేంచేసి ఉన్న పద్మావతి అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారికి గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. బిళ్లవారి వీధి, వీరభద్రస్వామి ఆలయం, గంగరాజు వీధి, హైస్కూలు సెంటరు, మురుగులమ్మ ఆలయం వరకూ ఊరేగింపు సాగింది. శ్రీనివాస బాలమిత్ర సంఘం అధ్యక్షుడు చింతపట్ల కృష్ణ రామ్మోహన్‌రావు, ఎంపీటీసీ హిమభారతి, బళ్ల విశ్వేశ్వరరావు, బళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం

మామిడికుదురు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్ పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం పెదపట్నంలంక గిడుగువారి పాలెంలో జరిగింది. దీనిలో భాగంగా స్థానికులకు పలు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఉచిత వైద్య సేవల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసిందన్నారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌వీ కె.నిర్మల కుమారి, హెల్త్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, ఏఎన్‌ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీలు పి.నాగదుర్గ, ఎస్.డోర్‌కాస్, ఆశ కార్యకర్తలు ఎస్.పద్మ, పీఎస్‌డీ లక్ష్మి, వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా నృసింహ జయంతి



అంతర్వేదిలో మహాశాంతి హోమం వద్దకు గరుడముడితో వచ్చిన స్వాములు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో గురువారం నృసింహ జయంతి ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. నృసింహజయంతి పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో స్వాముల దీక్షా విరమణను ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు పర్యవేక్షణలో వేదపండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేయించారు. ఏప్రిల్ 7, 8 తేదీల్లో 27 రోజుల స్వామివారి దీక్ష చేపట్టిన స్వాములు, నృసింహజయంతి రోజున దీక్షా విరమణ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన పథకంలో స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ

మలికిపురం: కొన్ని ప్రైవేటు విద్యాసంస్థల్లో అడ్మిషన్లు ప్రారంభించి ఫీజులు అక్రమ రూపంలో దోపిడీ మొదలు పెట్టారని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ ఆరోపించారు. గురువారం లక్కవరంలో వినియోగదారుల సంఘ సమావేశం జరిగింది. నగేష్ మాట్లాడుతూ దోపిడీ విషయంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఫీజులు, బోధన సిబ్బంది వివరాలతో కూడిన బోర్డులను ప్రదర్శించడం లేదని, యూనిఫాం బుక్స్ బహిరంగంగానే ఆయా విద్యాసంస్థల్లో విక్రయిస్తున్నారని అన్నారు. టాయిలెట్స్ నామమాత్రంగా నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యా హక్కు చట్టాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల సంఘ ఉపాధ్యక్షుడు పి.రాంబాబు, సహాయ కార్యదర్శి పి.శివశంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ఇటికాలమ్మ జాతర

అంబాజీపేట: మాచవరం గ్రామంలో వేంచేసిన ఇటికాలమ్మ జాతరను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పూజఘటాలను గ్రామోత్సవం నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నారిన శ్రీనివాసరావు, అరిగెల నాగబాబు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శుక్రవారం ఆలయ ప్రాంగణం వద్ద తీర్థం నిర్వహిస్తారన్నారు.